క్లుప్తంగా

డ్రైవింగ్‌లో నిబంధనలు పాటించాలి

డీఎస్పీ పల్లపురాజు



గురజాల : డ్రైవింగ్ చేసే సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని డీఎస్పీ పల్లపురాజు సూచించారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో 35వ జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లు వాడరాదన్నారు. సీటు బెల్టు ధరించాలన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి, సీఐ బాలకృష్ణ, ఎస్ఐలు బి.అనంత కృష్ణ, అశోక్, శివాని విద్యానికేతన్ నిర్వాహకుడు రవికుమార్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



వెల్దుర్తి: జాతీయ రహదారి 565లోని వెల్దుర్తి బస్టాండ్ సెంటర్‌లో డివైడర్‌పై కూర్చున్న వ్యక్తి చెయ్యి నుజ్జునుజ్జయిన ఘటన బుధవారం జరిగింది. వెల్దుర్తి గ్రామానికి చెందిన మల్లా చిన చలమయ్య తన స్నేహితులతో బస్టాండ్ సెంటర్‌లోని డివైడర్‌పై కూర్చొని మాట్లాడుతుండగా ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం నుంచి లోడ్‌తో వస్తున్న లారీకి ద్విచక్ర వాహనం ఎదురు రావటంతో దానిని తప్పించబోయి లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఆ పై కూర్చున్న చలమయ్యకు తగలడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చలమయ్యను హుటాహుటిన 108 వాహనంలో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన ఎస్ఐగా గోపాల్

మాచర్ల: పల్నాడు జిల్లా అర్బన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎస్.సౌందర్ రాజన్ గురజాలకు బదిలీ కాగా, తిరుపతి జిల్లా నుంచి బి.గోపాల్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు బుధవారం తెలిపారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా మాచర్ల ఎస్ఐను గురజాలకు బదిలీ చేయగా, తిరుపతికి చెందిన ఎస్ఐను మాచర్లకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

పిడుగురాళ్ల: ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మీ అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒకేషనల్ ట్రేడ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆహార పదార్థాలను ఎలా సంరక్షించాలనే విషయాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా విద్యార్థులను బేకరీకి తీసుకువెళ్లి కేకు, బ్రెడ్ తయారీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారెంపూడి: ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని హెచ్‌ఎం అనంతశివ అన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక దుర్గా స్వీట్స్, బేకరీ తయారీ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. అక్కడ స్వీట్స్, బేకరీ ఐటెమ్స్ ఎలా తయారు చేస్తారనే విషయమై పరిశీలన చేశారు. టైం సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెట్ ఒకేషనల్ ట్రైనర్ జి.శ్రీను విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు.

సర్వేయర్ కుటుంబానికి నగదు అందజేత



దుర్గి: ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కాన్వాయ్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా గాయపడిన ధర్మవరం సర్వేయర్ అంగడి కమల్ పాల తల్లిదండ్రులకు రూ.24 వేల నగదును అందజేశారు. బుధవారం స్థానిక మండల సర్వేయర్ కార్యాలయంలో సర్వేయర్ అసోసియేషన్ తరపున సభ్యులు బాధిత కుటుంబానికి మండల సర్వేయర్ వై.రఘుపతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు అసోసియేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మండల సర్వేయర్ రఘుపతి మాట్లాడుతూ అసోసియేషన్ తరపున ఎటువంటి సహాయ సహకారాలైనా అందిస్తామన్నారు. అసోసియేషన్ సభ్యులు ఐకమత్యంగా ఉండి మంచి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, తాలూకా ప్రెసిడెంట్ మునినాయక్, సెక్రటరీ రాజు, జాయింట్ సెక్రటరీ కసిన్యానాయక్, ఈసీ మెంబర్ అంజినాయక్, సభ్యులు చంద్రునాయక్, అనూష, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లకు శాశ్వత హక్కు

నాడు గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు డీకే పట్టాలు ఇచ్చేసి స్థలం ఎక్కడో తెలియక మౌలిక వసతులు లేక ఎంతో ఇబ్బందులు పడేవారు. ఆ డీకే పట్టాలను హౌసింగ్ కార్పొరేషన్ తనఖా పెట్టుకొని లబ్ధిదారులకు కొద్దిపాటి రుణాన్ని అందించేవారు. ఆ పట్టాలు ఇతరులు కొనుగోలు చేయాలన్నా, అమ్ముకోవాలన్నా ఒక్క రూపాయి అప్పు పుట్టేది కాదు. రిజిస్ట్రేషన్ వీలు లేక మార్కెట్ రేటు కంటే సగానికి తక్కువగానే అమ్ముకొనే పరిస్థితి.

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నిజం చేయాలని జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి పట్టాలు పంపిణీకి ముందే రోడ్లు, బోర్లు, మంచినీటి ట్యాంకులు, విద్యుత్ సరఫరా, వీధి లైట్లు అమర్చి, ప్రైవేటు రియల్ ఎస్టేట్ వెంచర్లకు దీటుగా ఏర్పాటు చేసి పట్టాలు పంపిణీ చేశారు. ఆ ఇంటిపై సర్వ హక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్‌ను ప్రస్తుత ప్రభుత్వం అందజేస్తుంది. అందుకోసం అసైన్డ్ భూముల చట్టాన్ని ప్రభుత్వం సవరించింది. పదేళ్ల తరువాత ఇవి టైటిల్ డీడ్‌గా మారతాయి. తద్వారా లబ్ధిదారులకు సర్వహక్కులు సంక్రమిస్తాయి.

- అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించి రిజిస్ట్రేషన్
- పెరగనున్న భూముల విలువ
- నియోజకవర్గంలో 20వేల మందికిపైగా ప్రయోజనం



జగనన్న కాలనీలో నిర్మాణంలో గృహాలు

మాచర్ల రూరల్: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో విప్లవాత్మకమైన పథకాలను తీసుకొచ్చి వారి ఆర్థిక ప్రయోజనాలకు రూపకల్పన చేస్తే ఆయన తనయుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి కంటే నాలుగడుగులు ముందుకు వేసి పేద ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం సంచలన నిర్ణయాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేయటమే లక్ష్యంగా స్థలాలు ఇచ్చి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో లేఅవుట్లు వేసి మౌలికసదుపాయాలు కల్పించి పట్టాలు పంపిణీ చేసి చరిత్రాత్మక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. పట్టాదారులకు పక్కా ఆస్తి అందించటమే కాకుండా వారికి సర్వహక్కులు ఉండేలా వారు అమ్ముకోవాలన్నా, కొనాలన్నా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించి సచివాలయాల్లోన్నే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు.



రాయవరం గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

20వేల మందికి పైగా లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు

గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్టర్ ఆఫీసులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో వీఆర్‌వోలు, కార్యదర్శులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సెలవు రోజుల్లో సైతం చేస్తున్నారు. స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటిపై సర్వహక్కులు సంభవించటంతో పాటు ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టుకొని రుణం పొందటమే కాకుండా ఇంటి విలువ పెరిగి భూ కొనుగోలుకు డిమాండ్ ఏర్పడుతుంది. ఇంటిని అమ్ముకోవటం, వారసులకు గిఫ్ట్ డీడ్ కింద బదిలీ చేసే ప్రక్రియ ఉంటుంది. నియోజకవర్గంలో 20వేల మందికిపైగా జగనన్న ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఇప్పటికే చక్కటి లేఅవుట్లలో గృహ నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు పక్కా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించటంతో వారు ఆనందంతో పరవశమవుతున్నారు.

20వేల మందికి పైగా గృహ లబ్ధిదారులకు ప్రయోజనం..



పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు నిరూపించుకున్నారు. సొంతింటి కలను నిజం చేసేందుకు చక్కని లేఅవుట్లు వేసి 20 వేల మందికిపైగా పట్టాలు పంపిణీ చేశాం. నేడు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించి పేదలకు శాశ్వత భూ హక్కు కల్పించుతున్నాం. దీని ద్వారా భూమి విలువ పెరిగి అమ్మకాలు, కొనుగోలు చేసుకొని ఆస్తి విలువ పెంచుకునే అవకాశం ఉంది.

–ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వేగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ..



జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా జరుపుతున్నాం. సెలవుల్లో సైతం ప్రత్యేకంగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నాం. ఇళ్లపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు రావటంతో పాటు ఎంతో మేలు జరుగుతుంది.

– ఎంపీడీవో సరోజినీ దేవి

తహసీల్దార్‌ల బాధ్యతల స్వీకారం



నూతన తహసీల్దార్ జయవర్ధన్‌కు స్వాగతం పలుకుతున్న డీటీ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది



నూతన తహసీల్దార్‌కు శాలువా కప్పి అభినందిస్తున్న డీటీలు, ఆర్ఐ, వీఆర్‌వోలు



తహసీల్దారు శ్రీరామకృష్ణకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

తహసీల్దార్‌గా జయవర్ధన్ బాధ్యతల స్వీకారం

కారెంపూడి: కారెంపూడి తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌గా బి.జయవర్ధన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్ జయవర్ధన్‌కు డీటీ కీర్తిసుధా స్రవంతి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జయవర్ధన్ ప్రకాశం జిల్లా కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఏవోగా పని చేస్తూ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ జి.శ్రీనివాస్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

మాచర్ల తహసీల్దార్‌గా మంజునాథరెడ్డి

మాచర్ల రూరల్: మాచర్ల మండల తహసీల్దార్‌గా మంజునాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా, మార్కాపురం తహసీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన షేక్ మహమ్మద్ హుస్సేన్ ప్రకాశం జిల్లా తాళ్లూరు బదిలీపై వెళ్లారు. మంజునాథరెడ్డికి డిప్యూటీ తహసీల్దార్‌లు బి.వాణి, షేక్ బాషా, ఏఎస్‌వో ప్రభాకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, టైపిస్టు శ్రీవల్లి, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌రావులు, వీఆర్‌వోలు మహమ్మద్ హుస్సేన్, గోపాల్‌రెడ్డి, భాస్కర్, నాగలక్ష్మి, నాగేశ్వరరావు, రవికుమార్ అభినందనలు తెలిపారు.

మాచవరం తహసీల్దారుగా శ్రీరామకృష్ణ

మాచవరం: మాచవరం మండల నూతన తహసీల్దారుగా డి.శ్రీరామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ప్రసాద్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు పలువురు తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా కలిగిరి మండల తహసీల్దారుగా పనిచేస్తున్న శ్రీరామకృష్ణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన శ్రీరామకృష్ణకు డీటీ సరోజ, ఆర్ఐ కోటేశ్వరరావు, సూపరింటెండెంట్ భూషణం, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

శరవేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో అర్హులైన పేదలకు ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు అందజేసింది. మండల వ్యాప్తంగా జగనన్న కాలనీలలో 1,043 ఇళ్ల పట్టాలు అందజేయగా శాశ్వత పక్కా గృహ నిర్మాణాల కొరకు పట్టాలు అందించిన ప్రతి ఒక్క మహిళ పేరున ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతుంది. మండల వ్యాప్తంగా సుమారు 45 శాతం వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయని ఈఓపీఆర్‌డీ వెంగళరావు తెలిపారు. మిగిలినవి కూడా త్వరగా పూర్తి చేసేందుకు సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉండి నూరు శాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఏరియా వైద్యశాలలో టీవీల ఏర్పాటు

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వివిధ వార్డుల్లో అమర్చిన ఐదు టీవీలను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఓపీ స్టేషన్, గర్భిణీ స్త్రీల వార్డు, చిన్నపిల్లల వార్డు, బహిరంగ ప్రదేశాల్లో ఐదు టీవీలను అమర్చారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ టీవీలు అమర్చడం ద్వారా గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక సలహాలు, సూచనలు నూరా అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇస్తారన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి. లక్ష్మణరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



రోడ్డు భద్రతా వారోత్సవాలలో మాట్లాడుతున్న ఎంవీఐ శేషురెడ్డి

మాచర్ల రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శేషురెడ్డి అన్నారు. బుధవారం మండలంలో న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు వాహనాలను నడిపే ముందు కచ్చితంగా లైసెన్స్ తీసుకొని, హెల్మెట్ ధరించాలన్నారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువత ప్రమాదానికి గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని ప్రయాణిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు చందోలు నాగేశ్వరరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడా వెంకటలక్ష్మి, ఆర్యవైశ్య వృద్ధాశ్రమ అధ్యక్షులు పోలిశెట్టి పిచ్చయ్య, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, పరిటాల ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజ్‌కుమార్, కొత్తమాసు గిరిజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఓటింగ్ నిర్వహణపై దృష్టి

సత్తెనపల్లి: ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి వీలుగా పక్కా ఏర్పాట్లు చేశామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ వెల్లడించారు. అభ్యర్థి నామినేషన్ వేసే వరకు కొత్తగా ఓటర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సవరణలకు మాత్రం ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలన్నారు. కొత్త జాబితాలో మరణాలు ఉంటే వారి కుటుంబ సభ్యులతో పంచనామా నిర్వహించి నిర్ణీత దరఖాస్తుపై సంతకాలు తీసుకొని తొలగిస్తారన్నారు. క్షేత్రస్థాయిలో సూపర్వైజర్లు, బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలన్నారు. అర్హులైన ఓటర్లను జాబితా నుంచి పొరపాటున డిలీట్ చేసినట్లయితే క్షేత్రస్థాయిలో బీఎల్వోలు తిరిగి రాజకీయ పార్టీల సహకారం తీసుకొని జాబితాలో ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లయితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నోటిఫికేషన్ వెలువడే నాటికి ఎటువంటి తప్పులు లేని జాబితా ఉండాలన్నారు. నియోజకవర్గంలో 109 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని గత ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఘర్షణలు, తదితర వాటిని దృష్టిలో పెట్టుకొని మరో 15 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. పోలీస్ యంత్రాంగంతో పాటు సాంకేతిక వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఆయా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అలజడులకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు.

ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి

బెల్లంకొండ: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయడం ద్వారా భవిష్యత్‌లో మంచి స్థాయిలో ఉంటారని బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల 23వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో 17 సంవత్సరాలు కష్టపడి చదివితే మిగిలిన జీవితమంతా సంతోషంగా ఉండవచ్చన్నారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గి కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీఎస్ ప్రసాద్, జేఎల్ఎస్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వెంకటేశ్వర్లు, చిలకలూరిపేట ప్రిన్సిపాల్ ఫీబి, కళాశాల అధ్యాపకులు సరోజినీ, కవిత, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ బోర్లకు త్వరలో మోటార్లు అందిస్తాం



ఉప్పలపాడులో వైఎస్సార్ జలకళ బోరు బావుల లోతులను కొలుస్తున్న అధికారులు

వెల్దుర్తి: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలోని వెల్దుర్తి మండలం, ఉప్పలపాడు గ్రామంలో బుధవారం వైఎస్సార్ జలకళ డీఆర్‌పీ గురుస్వామి, టీఏ గోవిందరాజులు గ్రామంలో వేసిన బోరుబావు లోతులను కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వేసిన బోర్లకు కరెంట్ ఏర్పాటుకు అంచనాలు రూపొందిస్తామన్నారు. త్వరలోనే బోరు, మోటార్లు అందిస్తామన్నారు. ఈ బోర్లు ఉపయోగంలోకి వస్తే వందలాది ఎకరాలు సస్యశ్యామలమవుతాయన్నారు. వర్షాధారంపై ఆధారపడి పంటలు పండించుకునే రైతులకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో బోర్లు మంజూరయ్యాయని, బోర్లలో నీరు పడిందని, బోరు, మోటారు మంజూరు చేస్తే రైతులు పంటలు పండించుకొని సంతోషంగా ఉంటారు.

సచివాలయాల ఆకస్మిక సందర్శన



గోలి సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్‌రావు

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో పి.శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన రెంటచింతల–1, 2, 3, గోలి సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కచ్చితంగా ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల పట్ల అనుచితంగా వ్యవహరించినా, వారిని ఇబ్బంది పెట్టినా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకు రూ.25 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కార్డులను ఎన్ని పంపిణీ చేయడం జరిగిందని తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ, పీఎంజేఏవై కార్డులను లబ్ధిదారులకు వలంటీర్లు కాలయాపన లేకుండా అందించాలన్నారు. కులగణన సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో ఆరోగ్యశ్రీ కార్డులు 10,448 మందికి గాను 90 శాతం అందజేసినట్లు, పీఎంజేఏవై కార్డులను 13,120 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 83 శాతం మందికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోలి సర్పంచ్ మున్నా చంద్రం, కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



అల్బెండజోల్ మాత్రలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో–2 శివనాగేశ్వరరావు

రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాలలో 01 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ (నులిపురుగు నివారణ మాత్రలు) వేసి నులిపురుగులను నివారిద్దామని ఎంఈవో –2 శివనాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అల్బెండజోల్ మాత్రలపై హెచ్‌ఎంలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో నున్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న కచ్చితంగా అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ముందుగా తల్లిదండ్రులకు అల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మొత్తం 54 పాఠశాలల్లో 9,600 మంది విద్యార్థులకు నూరు శాతం అల్బెండజోల్ మాత్రలను వేయడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేయడం వలన ఎటువంటి హాని ఉండదన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి పిల్లలకు ఈ మాత్రలు వేయడం వల్ల నులిపురుగులను పూర్తి స్థాయిలో నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నర్రా కృష్ణారెడ్డి, కె.ప్రదీప్‌రెడ్డి, ఎంఈవో–1 వేముల నాగయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

డీఎల్‌డీవో గబ్రూనాయక్



వైద్య శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్టును అందజేస్తున్న డీఎల్‌డీవో గబ్రూనాయక్

పిడుగురాళ్ల: ప్రజా ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని డీఎల్‌డీవో గబ్రూనాయక్ అన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ కృష్ణారావు బజారు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుంత స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు గ్రహించాలని అన్నారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, కౌన్సిలర్ ప్రారంభించారు. శిబిరంలో సుమారు 370 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. వీరందరికి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. వైద్యులు ఆంజనేయులు, సూపర్‌వైజర్లు రాజ్యం, ఎం.సీతారామయ్య, జి.చిరంజీవి, జి.సుధారాణి, పి.సుజాత, కె.పావని, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు కె.రత్నకుమారి, సచివాలయ అడ్మిన్ ఇల్లూరి కొండలు, నాగలక్ష్మీ, సుధీర్, గాయత్రి, జ్యోత్స్న, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాగునీటి సమస్యకు ముందస్తు చర్యలు



శావల్యాపురం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చేతి పంపులు మరమ్మతులు చేసే సిబ్బందితో సమీక్షించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 408 చేతిపంపులు ఉండగా గ్రామ స్థాయిలో చేతి పంపులన్నీ పూర్తిస్థాయిలో పని చేసేలా చూడాలన్నారు. సాగర్ జలాలతో నిండిన మంచినీటి చెరువులన్నీ పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు తాగునీరు కష్టాలు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. మండల పరిషత్ నిధులు రూ. 20 లక్షలు సిద్ధంగా ఉన్నాయని చేతిపంపులు మరమ్మతుల కోసం అవసరమైన నిధులు సత్వరమే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే వేసవికాలం తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయన్నారు. చేతి పంపులకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలన్నారు. రామసింగ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల నిర్వహణకేంద్రంగా కొండవీడు యూపీస్కూల్

యడ్లపాడు: దక్షిణ భారత హిందీ ప్రచారసభ మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ భాష హిందీ పరీక్ష కేంద్రంగా మండలంలోని కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాల ఎంపికై నట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 5 నుంచి 8వ తరగతి వరకు చదివే 92 మంది విద్యార్థులు 11వ తేదీన పరిచయ, ప్రాథమిక పరీక్షలు ఈ కేంద్రంలో రాయనున్నట్లు వెల్లడించారు.